నేను ప్రవర్తించిన తీరు మంచిదా, చెడ్డదా అని బేరీజు వేసుకుంటే యెందుకో హృదయంలో మొండి బాకు దిగినంత బాధ కల్గింది. ఛ...ఛ... ఆదివారం చక్కగా సినిమాకు వెళ్దాం అనుకున్నవాడిని వెళ్ళక సత్యం ఇంటికి వెళ్ళనేల? వెళ్ళితిని పో పెళ్ళిచూపులకు ముస్తాబైకూర్చున్న సత్యం నన్ను రమ్మననేల? రమ్మన్నా. వెంటనే నేనంగీకరించనేల! అంగీకరించాం అనుకుంటే అక్కడ ఆ అమ్మాయి దర్శనం ఇవ్వాలా? జరిగింది మర్చిపోక, అవాకులు, చవాకులు వాగాను.

సత్యం యెవరేది చెబితే అది నమ్మేవ్యక్తికాదు, కాని నా మాట వేద వాక్యం వాడికి. యెంత మరిచిపోదామన్నా, ఆ అమ్మాయి నన్ను నిలదీసి నట్టే వుంది.

"ఏమిటి? నా నడత మంచిది కాదా?" అన్నట్టే వుంది.

ప్రతిరోజూ అబద్ధం ఆడి, అక్రమాలు చేసేవాడికి బాధ వుండదు కాని, నేనెమిటి యిలా ప్రవర్తించాను. ఆ రాత్రంతా నిదురలేదు. ఈ పాటికి సత్యం వాళ్ళతో మాకీ సంబంధం వద్దని చెబుతాడేమో, చెప్పే వుంటాడు.

కానిమినుకు, మినుకుమనే ఆశ మాత్రం వుంది. ఇంత త్వరగా చెప్పడని.

అమ్మాయి తలి దండ్రులకు ఆదుర్దా యెక్కువ అప్పుడే సునీత తండ్రి మా వెంట వచ్చి. యెంతో ఆశగా అడగలేక, ఓ నవ్వు నవ్వాడు.

"రేపు నాన్నగారితో అన్ని విషయాలు కబురు చేస్తాను." అన్నాడు సత్యం.

"అలాగే బాబూ....' అన్నా,ఆ కళ్ళలో నెగెటివ్ రిప్లై రాకూడదు బాబూ— అన్న అభ్యర్థన ఉంది.

అతను ఉదయమే వచ్చాడేమో, రాత్రి నిదుర పోలేను. ప్రతి రాత్రి శివరాత్రే అవుతుంది. గబ గబ స్నానం చేసి. సత్యం ఇంటికి వెళ్ళాను. వాళ్ళ నాన్న వార్తా పత్రిక చదువుతున్నారు.

"రా శ్రీకాంత్ రా.... వీడికి మతి పోయింది చూడు మొన్న అమ్మాయి వివరాలు చెబితే విని నవ్వి, తనెవరి పెళ్ళిలోనో అమ్మాయిని చూశానని, పెళ్ళి ముహూర్తం పెట్టుకు రమ్మన్నాడు...."

"ఇప్పుడు వద్దంటున్నాడా?" ఆత్రుతగా అడిగాను.

"అవును నాయనా! ఇప్పుడేమో కారణం చెప్పడు- 'మాకీ సంబంధం నచ్చ లేదని చెప్పమంటాడు. నిన్న మధ్యవర్తితో బలవంతంగా పంపాను. నువ్వూ చూశావు అమ్మాయికేం లోపం? ఇప్పుడు కష్టం దగ్గర నేను ఏదో పేచి పెట్టానని అనుకోరా!" సత్యం తండ్రి బాధగా అన్నాడు.

"మీరు నిశ్చింతగా ఉండండి. నేను నచ్చ జెబుతాను." అన్నాను. ఒకందుకు



శ్రీమతి మాదిరెడ్డి సులోచన

నిశ్చింతగా ఉంది. ఇంకా సునీత వాళ్ళింటికి వెళ్ళలేదు. సత్యం రాక కోసం యెదురు చూస్తున్నాను.

సునీత పరిచయం కళ్ళముందు మెదిలింది. నేను బీకాం పాసవగానే నాన్నగారి స్నేహితుని కంపెనీలో ఉద్యోగం వేయించారు. 'శ్రీదేవి ప్యాకేజెస్' అని అటపెట్టెలు తయారు చేసేవాళ్ళం. నేను చేరిన సంవత్సరానికే వ్యాపారం బాగా విస్తృతం అయింది. క్షణం తీరికవుండేది కాదు. ఓ టైపిస్టును అపాయింట్ చేయమని అంకుల్ ఆదేశం.

పేపర్ ప్రకటన ఇదాం అనుకుంటుండగా, సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న సుందరం వచ్చి నమస్కరించాడు.

"చూడండి శ్రీకాంత్ గారూ! మీ కభ్యంతరం లేకపోతే ట్రయల్ బేసిస్ పై మా కజిన్‌ను తీసుకోండి. పని నచ్చితేనే అపాయింట్ చెద్దురు...." అన్నాడు.

"అలాగే తీసుకురండి." అన్నాను. అడ్వర్టైజ్‌మెంటు, ఇంటర్వ్యూలు అంటూ యెవడు యాతనపడతాడు?

ఆ సాయంత్రమే, పార్టీ ఏదో వుంటే హోటల్ ఎమరాల్డ్‌కు వెళ్ళాను. అప్రయత్నంగా నా కళ్ళు ఒకచోట కూర్చున్న ఇద్దరు యువతుల పై పడాయి. స్పష్టే వారి పట్లపక్షపాతం వహించినట్టుఅంపింగా



# మనసా నొప్పించకే ఇలా..!

మాదిరెడ్డి సులోచన



ఉన్నారు. దానికి తగు ప్రత్యేకంగా అలంకరించుకున్నారు. ఒక్క క్షణం వారి మీదే దృష్టి నిలిచిపోయింది.

ఖరీదయిన చీరలా? కళాత్మకమైన నగలా? ఏం లేవు

నేత ఆకు పచ్చ ఆర్గండీ చీరలు కట్టుకున్నారు. ముదురాకు పచ్చ మట్టి గాజులు ఒక్కొక్క చేతికి పదేసి వేసుకున్నారు. బొమల నడుమ చిన్న నల్లని బొట్టు, చెవులకు ప్లాస్టిక్ టాప్స్.

మా ఇంట్లో మా చెల్లెళ్ళు, మా ఆవిడ నచ్చిన చీర. నచ్చిన నగ పోనివ్వరు. కాని యెప్పుడూ ఏదో వేషం వేసుకున్నట్టే ఉంటారు. సభ్యత అడ్డువచ్చి ముఖం తిప్పుకున్నాను.

మర్నాడుదయం నేను ఆఫీసుకు వెళ్ళి కూర్చున్నాను. సుందరం వచ్చాడు అతని

వెనుక తెల్ల అర్గండీ చీర. తెల్లని మట్టి గాజులు వేసుకుని వచ్చిందో మెరుపుతీగ. నిన్న నేనుచూసిన అమ్మాయిలలో ఒకరు.

"నమస్తే...."

"నమస్తే కూర్చోండి." యెదురు సీట్లు చూపించాను. ఇద్దరూ కూర్చున్నారు.

"మా చిన్న కూతురు సునీత.... సునీతా మా మేనేజర్ ప్లస్ ఫ్రెండ్." మా యిద్దరికి పరిచయం చేశాడు. చిరునవ్వుతోనే నమస్కరించుకున్నాం. టీ తెప్పించి ఇచ్చాను ఆ అమ్మాయి పట్ల ఆకర్షణో, సుందరం పట్ల వున్న నమ్మకమో తెలియదుగాని, వెంటనే అప్పాయింట్ మెంటు ఉత్తరం ఇచ్చాను.

"థాంక్స్...." ఆ అమ్మాయి చేతులు జోడించింది. ఆ చేతులు దగ్గరగా లాక్కుని హృదయానికి హత్తుకుని, గట్టిగా ఆ అందమైన పెదవులు ముద్దుపెట్టుకుందాం అనిపించింది.

"నా గుడ్ విల్ ఉపయోగించి, ఉద్యోగం ఇప్పించాను. నీ తెలివితేటలుపయోగించి, ఉద్యోగం నిలుపుకోవాలి, చిన్నచెల్లీ." అన్నాడు సుందరం.

"ఇంకో పెద్దచెల్లి ఉందా?" అన్నాను కుతూహలంగా ఆ అమ్మాయి బయటికి వెళ్ళాక.

"అవునండీ. రజిత పెద్ద చెల్లాయి. బాబాయి పిల్లలు కలగరనుకున్న సమయాన పుట్టిన పిల్లలు. ఆయనకో సమస్య. వీళ్ళ వివాహాలు. రజిత వెరీలక్కీ. అనుకోకుండా ఇంజనీరు సంబంధం కుదిరింది." అన్నాడు ఉత్సాహంగా. నిజంగా ఆ ఇంజనీరే లక్కీ.

"అహ. అలాగా." అన్నాను.

"మా బాబాయ్ రిటైర్ అయ్యేనాటికి వచ్చిన ప్రావిడెంటు ఫండ్ పెట్టి, ఆ ఇల్లు కొన్నాడు. ఇప్పుడు రజిత పెళ్ళికి వస్తున్న పెన్షన్ అమ్ముతున్నాడు" అన్నాడు.

అయ్యో అనిపించింది. సుందరం ఒక్కమాట అడిగితే సునీతను చేసుకోవటానికి నేను రడీయే. నా ఆలోచనకు నాకే నవ్వు వచ్చింది. ఆ అమ్మాయిని చూసి ఎంతసేపయింది! నాకా అర్హత ఉందా!

సునీత మంచి పనిమంతురాలని వారం రోజులలోనే తెలిసిపోయింది. ఆ అమ్మాయిని చూస్తే ముచ్చటవేసేది. ఏ చీర కట్టినా ఓ ప్రత్యేకత ఉండేది. మా ఇంట్లో పనివాళ్ళకని తెచ్చాడు హాండ్లూమ్ సెంటర్లో. అది ఇరవై ఒక్క రూపాయల చీర. రుమాలుగుడ్డల్లా ఉన్నాయని. "పనివారికని మరీ అంత నాసివి తీసుకు వస్తారా?" అన్నాను. గళ్ళ చీరలంటే నాకు ఒక రకమైన ఎలర్జీ. అన్ని రంగుల్లో పసుపు, నలుపు కలిసినది అదోలా ఉంది. అయినా చీరల గొడవ నాకెందుకని ఊరుకున్నాను.

మర్నాడు ఆశ్చర్యంగా కళ్ళు చికిలించాను- నిన్న నేను ఏ చీర అయితే ఏవగించుకున్నానో అదే... అలాంటి చీరే కట్టుకుని వచ్చింది సునీత, నల్లని గాజులు. బొట్టుతో కన్ను చెదిరేలా వుంది.

నిజంగా కొందరు అదృష్టవంతులు నలభై దాటినా ఇరవై ఏళ్ళ వారిలా ఉంటారు.

అలాగే కొందరు ఏ బట్ట కట్టినా అందంగా ఉంటారు. పోనీ సునీతది మరీ మైదాపిండి, రోజ్ కలిపిన రంగు కాదు. ఆ అమ్మాయికి అలంకారంపట్ల శ్రద్ధ ఎక్కువ అనుకున్నాను.

నాకు తెలియకుండా ఆ అమ్మాయిపట్ల ఆకర్షణ పెంచుకున్నాను. నా మనసులో మాట చెప్పాలని ఉందకాని, సాంఘిక నియమాలు అడ్డువస్తాయి. వివాహితుడిని, ఆ అమ్మాయిని మూగగా ఆరాధించటం తప్ప, వివాహం చేసుకునే యోగ్యత లేదు.

నాకు ఇరవై పూర్తి కాకముందే అత్తయ్యకు క్యాన్సర్ అని, ఆమె కూతుర్ని నాకిచ్చి పెళ్ళి చేశారు.

వసంత అందవిహీనురాలు కాదు. చదువు సంధ్యలు లేనిదీకాదు. ఆ మాటకు వస్తే నేనే ఇంటర్ తప్పాను. బికాం రెండో సంవత్సరం పరీక్ష ఇవ్వలేదు. కాని వసంత ప్రతీ పరీక్ష పాసయింది. ఇంట్లో అందరికీ ప్రీతిపాత్రురాలు.

నాకు, ఆమెకు మనస్పర్థలు లేవు.

పోనీ కొన్నాళ్ళు సరదాగా సునీతతో తిరుగుదాం అనుకున్నాను. ఆ ఆదివారం నేను, వసంత సినిమాకు వెళ్ళాం. అదే సినిమాకు రజిత, సునీత వచ్చారు.

వాళ్ళకు వసంతను పరిచయం చెయ్యక తప్పలేదు.

"మరదలు కమ్ వైఫునంటీ...." అంటూ మధ్యలో అందుకుంది వసంత. ముగ్గురూ కలిసి మాట్లాడుకున్నారు.

నేను నీరసపడిపోయాను. వివాహితుడయిన పురుషుడితో ఏ స్త్రీ స్వేచ్ఛగా ఉండదు. ఆ సంగతి తెలుసు. అందునా సునీత లాంటి అయ్యవారు బిడ్డలు. ఆఫీసులో కాస్త ఆలస్యం అయితే చాలు, తండ్రి వచ్చి బయట కాచుకుంటాడు.

మరోసారి, రజిత వివాహానికి పిలవటానికి వచ్చింది సునీత. నేనే అనుకుంటే ఇంట్లో అందరూ ఆమెను పొగిడారు.


"సంపెంగ మొగ్గలా ఉందిరా పిల్ల." అన్నది అమ్మ.

"కొందరు చాలా ఆకర్షణీయంగా ఉంటారు కదన్నయ్యా." అన్నది చెల్లాయి. వసంతకూడా ఆమె అందం పొగిడింది.

"మరి నాదగ్గర పనిచేసేవారంటే ఏమనుకున్నారు!" అన్నాను గర్వంగా. అలా అందరి ప్రశంసలు పొందిన సునీత అంటే నాకొక రకమైన అభిమానం ఆరాధన ఏర్పడ్డాయి.

కాని ఆ అమ్మాయి మాత్రం తన పరిధి నుండి ఒక్క అంగుళం ముందుకు రాలేదు.

ఆమె బిగుసుకుపోవటం నాకొక సవాలుగా తయారయింది. అలా దాగుడుమూతలు ఆడుతుండగానే ఆరు నెలలు గడిచిపోయాయి. ఆమె నిర్లక్ష్యం చేస్తుందేమోనని బాధ కలిగేది.



ఒక్కసారయినా నావంక చూసి, ఇలానికి వివాహం పాతుంచే అన్నభావం వస్తే నా ఇగో తృప్తిపడేదేమో. ఒక్కసారయినా నాగురించి ఆలోచించదా?

ఇలాంటి విషయాలలో ధైర్యం చేయాలి. వారం రోజులు ఆలోచించాను. ఆమె క్రితంరోజు చంద్రికి ఒంట్లో బాపులేదనటం గుర్తుకు వచ్చింది. నవ్వుకున్నాను.

"మిస్ సునీతా! ఈ రోజు కాస్త పని ఉంటుంది. ఆరు గంటలవరకు ఉండాలి" అన్నాను.

"అది కాదు సార్...." అడ్డు చెప్పబోయింది.

"మీ నాన్నకు ఒంట్లో బాపుంలేదు, అంతేనా? కావాలంటే నేను డ్రాప్‌చేస్తాను" అన్నాను.

ఆరోజు సుందరం ఉదయమే వెళ్ళిపోయాడు.

"నో సార్! నేనిప్పుడు టైప్ చేసినా రేపేకదా పోస్ట్‌లో వెళ్ళేది, అందుకని ఇంటికి తీసుకువెళ్తాను," అన్నది.

"ఇంటి దగ్గర టైప్‌మిషన్ ఉందా?"

"మా ప్రక్కింటి బాబాయి దగ్గర ఉంది" అన్నది ఫైళ్ళు సర్దుతూ.

"ఇంత పిరికి వాళ్ళు, మడికట్టుకుని కూర్చునేవాళ్ళు ఉద్యోగాలకు రావచ్చా. ఏదయినా చేయాలంటే ఆరు గంటల తరువాతే చేయాలా? అంతకు ముందు చేయకూడదా" అన్నాను కోపంగా చూస్తూ.

"సార్ ...." ఆమె అపనమ్మకంగా చూసింది.

"ఛీ.... ఛీ ... అందుకే స్త్రీలను వేసుకోవటం ఇష్టంలేదు. ఈ సుందరం ప్రాణాలు తీసి. వేయించాడు." అన్నాను. ఒక్క నిముషం నా వంక చూసింది.


"సార్! నాకు తెలుసు, మీరు మా సుందరం అన్నయ్యలాంటివారు. ఇక్కడ నాకేం ప్రమాదం లేదని. కాని నల్గురి నోళ్ళలో నానటం నాకిష్టంలేదు" అన్నది.

"నేను.... నేను .... సుందరమన్నయ్య లాంటి వాడినా! ఇంకానయం, తాతలాంటి వాడినని అనలేదు."

నాకు విపరీతమైన కోపం వచ్చింది. అయినా పైకి నవ్వాను.

"లోకులు కాకులు అన్నారు.వారి మాటలకు ఎందుకు విలువ ఇవ్వాలి?"అన్నాను కోపంగా.

"ఓ.... కె.... ఏం టైప్ చేయాలో ఇవ్వండి." అన్నది కాస్త కఠినంగా. పేపర్లిచ్చాను. ఆమెనించి ఎదురు దీక్షగా చేస్తూనే ఉంది నిజంగా ఆమె ధైర్యం నాకు సవాలుగా నిల్చింది.



వెళ్ళి తలుపువేస్తే!

ఉహూ! నా గదిలోకి పిలిచి చెయ్యి పట్టుకుంటే.... ఇలా ఏవేవో రకాలుగా ఆలోచిస్తుండగానే ఆమె కాగితాలు పట్టుకుని వచ్చింది. అవి బల్లమీద బొత్తి పెట్టింది. ముఖంపట్టిన చెమట తుడుచుకుంది.

"గుడ్ నైట్ ....వస్తాను సర్ ...."ఆమె వెనుతిరిగింది.

"సునీతా...." ధైర్యంచేసి ఆమె చెయ్యి పట్టుకున్నాను.

"సర్ ...." విస్మయంగా చూచింది.

"సునీతా... ప్లీజ్.... మనం ఏదయినా హోటల్‌కు వెళ్దాం...." అన్నాను.

"ఉష్! అక్కడ వాచ్‌మాన్ ఉన్నాడు ....వెళ్దాం.... వదలండి" అన్నది. వదిలేసాను-నాకెందో ఆనందంగా ఉంది.

వీళ్ళ గొప్పలన్నీ మగాడు చొరవ చెయ్యనంతవరకే. ఆఫీసు చెయ్యి పట్టుకుంటే కాదనే అబల ఉంటుందా?

నా ఆలోచనలో నేనుండగానే దాని చెంపకాయకొట్టింది. ఒక్కంగలో బయటికి వెళ్ళి తలుపులు దగ్గరగా లాగి, గడియ వేసింది. ఆమె వెళ్ళిపోయింది.

నాకు తేరుకోటానికి పది నిముషాలు పట్టింది. కిటికీలోనుండి వాచ్‌మన్‌ని పిలవచ్చు కాని. అభిమానం అడ్డువచ్చింది. వాడికేం చెప్పను! ఆ నిముషంలో సునీతను నలిపి నాశనం చెయ్యాలనిపించింది. కాని ఎలా? బాత్‌రూంలోకి వెళ్ళి ముఖం కడుక్కున్నాను. ఆ నిమిషం ఆత్మ విమర్శ చేసుకోవటం మరిచిపోయాను.

వాచ్‌మన్ తలుపు తీశాడు.

"సునీతమ్మ చెప్పిందయ్యా. మీరు ఏడు గంటలవరకు డిస్టర్బ్ చెయ్యొద్దన్నారట కదా...." అన్నాడు.

అమ్మయ్య! నిట్టూర్చాను.సుందరానికేం చెబుతుంది? రేపు ఆఫీసుకు వస్తుందా... ఇత్యాది ఆలోచనలతో ఇల్లు చేరాను

"నీకోసం చూచి చూచి వసంతా పిల్లలూ సినిమాకెళ్ళారు." అన్నదిఅమ్మ. నాకెందుకో చాలా రిలీఫ్ అనిపించింది.

ఆ రాత్రి నిద్రమాత్ర వేసుకుని పడుకున్నాను. మర్నాడు త్వరగాలేచి, తయారయి వెళ్ళాను. అప్పటికే సునీత వచ్చి టైప్ చేస్తోంది. నేను ఆశ్చర్యపోయాను. అయిదునిమిషాల తర్వాత తెలిసింది. అది రిజిగ్నేషన్ లెటర్ అని. సునీత వచ్చింది.

"సారీ సర్. మీలాంటి విద్యావంతులు కూడా స్త్రీని ఇంత చులకనగా చూస్తారనుకోలేదు. ఇదిగో నా రిజిగ్నేషన్. ఈ విషయం నేను మరిచిపోతున్నాను. మీరు కూడా మరిచిపోతే మంచిది." అన్నది రిజిగ్నేషన్ బల్లమీదపెట్టి. నాకు నోట మాట రాలేదు.

"మీరు ఈ తరం వారు. ఆఫీసుకు, అది రావానికి కొత్త నిర్వచనం ఇస్తారనుకున్నాను" అన్నది ఆవేదనగా.

"అయామ్ సారీ...." అన్నాను నోరు పెగల్చుకుని.

"అన్నయ్యకుకూడా చెప్పలేదు. నాన్న ఆరోగ్యం బాగాలేదు, అమ్మ ఒక్కర్తి చేసుకోలేక పోతుందని చెప్పాను" అన్నది హెచ్చరికగా, తలాడించాను.

సునీత వెళ్ళిపోయింది. ఆ అమ్మాయి నన్ను చిత్తుగా ఓడించింది. నా పురుషాహంకారం పై దెబ్బతీసింది.


సుందరాన్ని నేను నాల్గు కేకలువేసి. మరో టైపిస్ట్‌ను కుదుర్చుకున్నాను. ఆరేడు నెలలు గడిచిపోయాయి.

నిన్న ఆదివారం ఉదయం లేవగానే రోజంతా ఎలా గడపాలన్న తపన పట్టుకుంది. వసంత పుట్టింటికి వెళ్ళింది.

టిఫిన్ ముగించి చిన్నప్పటి స్నేహితుడు సతీష్ ఇంటికి బయలుదేరాను. సతీష్‌ను అందరం సత్యం అంటుంటాం.

"రారా.... సమయానికి వచ్చావ్...." పెళ్ళిచూపులకు వెళుతున్నట్టు చెప్పాడు.

"సరే మళ్ళీ వస్తాను." వెనుతిరిగాను.




"భలేవాడివిరా. నిన్ను రమ్మనే. పద." బలవంతంగా లాక్కువెళ్ళాడు. ఇద్దరం వెళ్ళాం. సిమెంటుతో కట్టిన ఇల్లు రంగు కూడా లేదు. ఒకప్రక్క రెండే గదులున్నాయి. ముందు నీటుగా ఉంది.

ఒక అరవై ఏళ్ళ పెద్దాయన పైజామా లాల్చితో వచ్చి ఆదరంగా తీసుకువెళ్ళి కూర్చోబెట్టాడు.

కాఫీ తెచ్చిన అమ్మాయిని చూసి నేను బిగుసుకుపోయాను- సునీత!

"నమస్తే సర్.... నమస్తే...." నాకే ముందు నమస్కరించింది. ట్రే బల్లమీద పెట్టి యెదుటి కుర్చీలో కూర్చుంది.

సతీష్ ఆశ్చర్యంగా నన్నూ, సునీతను మార్చి,మార్చి చూశాడు. అది గమనించిన సునీత చిరునవ్వుతో చెప్పింది.

"నాన్నా! నేను కొన్నినెలలు టైపిస్టుగా ఉద్యోగం చేశాను గుర్తుందా. వీరి కంపెనీలోనే...." అన్నది నన్ను చూపి.

ఆరోజుకూడా ఆమెపై నుండి కళ్ళు తిప్పుకోవటం చాలా కష్టం అయింది.

గులాబిరంగులో చెక్స్‌ఉన్న కాశ్మీర్ చీరలో యెంతో అందంగా హుందాగా ఉంది.ఆ నవ్వు నన్ను వెక్కిరించినట్టుంది.

కాఫీలు త్రాగాం. నాకు చేదు విషంలా రుచించింది కాఫీ.

"వివాహం అయ్యాక ఉద్యోగం చెయ్యాలనుకుంటున్నారా?" సత్యం అడిగాడు.

"అవకాశాన్ని, అవసరాన్ని బట్టి ఆలోచించాలి." అన్నది.

ఎంత అహంకారం. కాబోయే మొగుడు కదా, మీ ఇష్టం అంటే ఏం పోయిందో

"మరి వసామండీ.. రేపు నాన్నగారొచ్చి మాట్లాడుతారు." అన్నాడు సత్యం. అతను యెంతో ఆశగా చూశాడు.

నా నెత్తిన శని పిశాచం యెక్కిందేమో సునీత నవ్వు నన్ను సవాలు చేసినట్లుంది. దీనంగా నా రహస్యం కాపాడు అన్నటుంటే బావుండేదేమో. మానవ సహజమైన బలహీనత తలెత్తింది.

ఇద్దరం ఆటో యెక్కాం.

"మా వాళ్ళంతా ఆ అమ్మాయి కుటుంబం గురించి. చాలా ఉన్నతంగా చెప్పారనుకో అయినా నీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాడు సతీష్.

"ఆ అమ్మాయి నడత అంత మంచిది కాదురా" అన్నాను.

సతీష్ జవాబు ఇవ్వలేదుకాని తీవ్రంగా ఆలోచించటం మొదలుపెట్టాడు.

నోరు జారాకగాని నా పొరపాటు తెలిసి రాలేదు. నా మనసే నన్ను నిలదీసింది. నిజంగా మానవత్వం ఉన్న మనిషివేనా అంటూ హేళనగా ప్రశ్నించింది.

ఆ క్షణంనుండి,ఈ క్షణంవరకు ఇరవై నాల్గుగంటలు ఒక్క నిమిషం నిశ్చింతగా ఉండలేదు. గుండెల్లో ఏదో బాధ, తపన బయలుదేరాయి. నేను ఏం చేయబోయాను, సంస్కారం ఉన్న ఏ మనిషీ చేయతగని పని చేయబోయాను.

ఒక్కరాత్రే నిదుర పోలేకపోయానే! జీవితాంతం యెలా గడపగలను! సునీత పట కసి, ద్వేషం,కోపం కరిగిపోయాయి. ఆ స్థానంలో గౌరవం, అభిమానం చోటు చేసుకున్నాయి.

"ఏమిట్రా ఆఫీసుకు వెళ్ళలేదా?" సతీష్ వచ్చాడు

"వెళ్తాను, నిన్ను చూసిపోదామని...." అన్నాను.

"నేను పర్మిషన్ పెట్టాను- ఏమిటి?" అన్నాడు.

"నీ గదిలోకి వెళ్దాం పద."

సతీష్ గదిలోకి రాగానే, జరిగిందంతా చెప్పాను. వాడి చేతులు పట్టుకున్నాను.

"సత్యం! నిజంగా మన చదువులకు అర్థం లేదురా, ఇంకా ఈ ప్రపంచంలో నేర్చుకోవలసింది చాలా ఉంది...." అన్నాను.

"నువ్వు.... నువ్వు అంటున్నది నిజమేనట్రా?" ఆశ్చర్యంగా, అపనమ్మకంగా చూశాడు.

"నిజం సత్యం. నన్ను.... నన్ను క్షమించరా. సునీత నిజంగా అపురూపమైన స్త్రీ" అన్నాను ప్రాధేయపూర్వకంగా.

"ఎంత గండం గడిచిందిరా, ఆ అమ్మాయి గురించి ఉన్నతంగా చెప్పిన వ్యక్తిని నాల్గు జాడించాలని వెళ్ళాను. అతనింట్లో లేడు" అన్నాడు సత్యం ఆశ్చర్యంగా, ఇంకా నమ్మకం లేనట్టు చూస్తూ.

"సత్యం! నా మనసే నన్ను నొప్పిస్తుంటే నేను భరించలేనురా. ఇప్పుడే వెళ్తాను" అన్నాను ఆవేశంగా.

"ఎక్కడికిరా?"

"సునీత దగ్గరకు. నీ ప్రతినిధిగా వెళ్తాను. నువ్వు అంగీకరించావని చెబుతాన్నా." అన్నాను ఆవేశంగా.

సతీష్ నన్నే చూచాడు.

"నా మాటపై నమ్మకం లేదుకదూ? ప్రపంచమే అంతరా. నిజం చెబితే ఎవరూ నమ్మరు. అబద్ధాలు చెబితే నమ్ముతారు." అన్నాను.

"కాదురా శ్రీకాంత్! నీలాంటి మనసే అందరికి ఉంటే యెంత బావుండేది-ఎన్నో అనర్థాలు తప్పేవి...."

ఆ తరువాత పది నిమిషాలు వాడి దగ్గరుండి వచ్చేశాను.

సునీత ఇంటి తలుపు తట్టాను. తలుపు తీసిన సునీతముఖంలో రంగులు మారాయి.

"ఏం సునీతా! సుందరంవస్తే ఇలాగే నిలబెడతావా?" అన్నాను నవ్వుతూ.

"రండి.... రండి" అన్నది కంగారుగా.

"నాన్నగారు లేరా?" అన్నాను లోపలికి చూస్తూ.

"ఎవరదీ...." అంటూ ముసలాయన వచ్చారు.

"మా సతీష్ ముహూర్తం పెట్టించమన్నాడండీ" అన్నాను.

అతని ముఖంలో ఆ క్షణంలో వెలిగిన వెలుగు చూసి, నేను చేసిన పనికి గర్వించాను. సునీత ఇంకా అపనమ్మకంగా చూస్తోంది. మేము తారీఖులు చూస్తున్నాం.

●